తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం
5 మార్చి 2026


Follow :

# తార్నాక

## పరిశోధనా కేంద్రాలకు కేరాఫ్ అడ్రస్




### దేశంలోని అత్యున్నత శాస్త్ర సంస్థలు ఇక్కడే

**సికింద్రాబాద్, మార్చి 4 (జనం సాక్షి):** తార్నాక అనేక పరిశోధనా కేంద్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్‌కు పరిశోధనా హబ్‌గా పేరుంది. ఈ హబ్‌లోనే అత్యున్నత పరిశోధనా సంస్థల్లో చాలా వరకు తార్నాక, తార్నాక సమీపంలోనే ఉన్నాయి. మందుల తయారీ, జన్యు-డీఎన్ఏ పరిశోధనలు, నేరగాళ్ల గుర్తింపు, పంటల కొత్త వంగడాల అభివృద్ధి, భూకంపాల అంచనా వంటి రంగాల్లో ప్రపంచ స్థాయి పరిశోధనలు ఇక్కడే జరుగుతున్నాయి.

**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్)**

పోషకాహారం జాతీయ పరిశోధనా కేంద్రంగా ప్రసిద్ధి చెందిన ఈ సంస్థను 1918లో సర్ రాబర్ట్ మెక్‌కారిసన్ బ్రిటన్‌లో స్థాపించారు. మొదట తమిళనాడు కూనూర్‌లోని పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్‌లో బెరిబెరి అధ్యయనం కోసం ఒక గది ప్రయోగశాలగా ప్రారంభమైంది. 1923లో ఆర్థిక కారణాలతో రద్దయినా, తర్వాత డెఫిషియన్సీ డిసీజ్ ఎంక్వైరీగా పునరుద్ధరణ పొందింది. 1928-29లో మెక్‌కారిసన్ దాని మొదటి డైరెక్టర్‌గా న్యూట్రిషన్ రీసెర్చ్ లాబొరేటరీస్‌గా మార్చారు. 1958లో హైదరాబాద్‌కు మారి, 1969లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ పేరుతో కొనసాగుతోంది.
ఎన్ఐఎన్‌లో క్లినికల్ న్యూట్రిషన్, ఫలితాల పరిశోధన, ఫార్మకాలజీ, పాథాలజీ, టాక్సికాలజీ, ఫుడ్ కెమిస్ట్రీ, ఎండోక్రినాలజీ, మాలిక్యులర్ బయాలజీ, రీజెనరేటివ్ మెడిసిన్, కమ్యూనిటీ న్యూట్రిషన్, ఆప్తాల్మాలజీ, స్పోర్ట్స్ న్యూట్రిషన్‌లో పరిశోధనలు జరుగుతున్నాయి. పేటెంట్ అభివృద్ధి కూడా ఇక్కడే జరుగుతుంది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్ వంటి సంస్థలు ఎన్ఐఎన్‌ను ఆహార నాణ్యత, భద్రత, పోషకాహార పరిశోధనలో అత్యుత్తమ కేంద్రంగా గుర్తించాయి.

ఎన్ఐఎన్ ఆవరణలోనే నేషనల్ సెంటర్ ఫర్ లాబొరేటరీ యానిమల్ సైన్స్, ఫుడ్ అండ్ డ్రగ్ టాక్సికాలజీ రీసెర్చ్ సెంటర్, నేషనల్ న్యూట్రిషన్ మానిటరింగ్ బ్యూరో వంటి అనుబంధ సంస్థలు కూడా ఉన్నాయి. రాక్‌ఫెల్లర్ విశ్వవిద్యాలయం, కొలరాడో విశ్వవిద్యాలయ వైద్య పాఠశాల, వాషింగ్టన్ విశ్వవిద్యాలయ వైద్య పాఠశాల, ఆస్ట్రేలియాలోని వోలోంగాంగ్ విశ్వవిద్యాలయం వంటి అంతర్జాతీయ కేంద్రాలతో సహకారంతో పరిశోధనలు నిర్వహిస్తోంది.
సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్డీ) భారతీయ బయోటెక్నాలజీ పరిశోధనా కేంద్రం (డీబీటీ) ఆధ్వర్యంలో పనిచేసే ఈ సంస్థ మొదట తార్నాకలో ఉండేది. ప్రస్తుతం ఉప్పల్ క్యాంపస్‌కు మారింది. అప్పటి సీసీఎంబీ డైరెక్టర్ లాల్జీ సింగ్ ఏర్పాటు చేశారు. డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ద్వారా నేరస్థుల గుర్తింపు, జీవ జాతుల డీఎన్ఏ పరిశోధనలు ఇక్కడే జరుగుతాయి. చిన్న క్లూతోనే నేరగాళ్ల జీవిత వృత్తాంతాన్ని బయటపెట్టే సామర్థ్యం ఉంది. బిర్యానీ రైస్‌లో కల్తీ పరిశోధనలు కూడా ఇక్కడే జరిగాయి.

**సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)**

1977లో స్థాపించిన ఈ కేంద్రం కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఆధునిక జీవశాస్త్రం, పంటల కొత్త వంగడాలు, గ్లాకోమా పరిశోధనలు ఇక్కడే జరుగుతున్నాయి. యునెస్కో గ్లోబల్ మాలిక్యులర్ అండ్ సెల్ బయాలజీ నెట్‌వర్క్‌లో భాగం. నెబ్రాస్కా విశ్వవిద్యాలయ వైద్య కేంద్రం, హార్వర్డ్ మెడికల్ స్కూల్, ఇంపీరియల్ క్యాన్సర్ రీసెర్చ్ ఫండ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం వంటి అంతర్జాతీయ సంస్థలతో సహకారంతో పరిశోధనలు జరుగుతున్నాయి. కరోనా కాలంలో ఆక్సిజన్ కిట్లు, రక్త నమూనాల టెస్టులు కూడా ఇక్కడే జరిగాయి.

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)**

1944లో తార్నాకలో స్థాపించిన ఈ కేంద్రం సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. రసాయన శాస్త్రం, బయోకెమిస్ట్రీ, బయోఇన్ఫర్మేటిక్స్, కెమికల్ ఇంజనీరింగ్‌లో పరిశోధనలు జరుగుతున్నాయి. పురుగుమందులు, మందులు, సేంద్రీయ మధ్యవర్తులు, ఉత్ప్రేరకాలు, పాలిమర్లు, సేంద్రీయ పూతలు, తక్కువ గ్రేడ్ బొగ్గు వినియోగం, కూరగాయల నూనెల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు, వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణ (మలేరియా, ఫైలేరియా, జపనీస్ ఎన్సెఫాలిటిస్, డెంగ్యూ)పై పరిశోధనలు జరుగుతున్నాయి. నల్గొండ ఫ్లోరైడ్ బాధిత గ్రామాల్లో శుద్ధమైన నీటి సరఫరా ప్రాజెక్టు కూడా ఇక్కడి సైంటిస్టులే చేపట్టారు.
తార్నాకలోని ఈ పరిశోధనా సంస్థలు దేశ ఆరోగ్యం, వ్యవసాయం, నేర నిర్మూలన, పర్యావరణ రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. హైదరాబాద్‌ను పరిశోధనా హబ్‌గా మార్చిన ఈ సంస్థలు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తాయని నిపుణులు అంటున్నారు.

# చెరువులో గల్లంతైన గురుకుల విద్యార్థి మృతి

- నిర్లక్ష్యం వల్లే ప్రాణం పోయిందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆరోపణ
- మృతుడి కుటుంబానికి 7.లక్షల యాభై వేలు ఎగ్జిగ్రేషియో..
- కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు
- వసతి గృహ సిబ్బందిపై విచారణ.. చర్యలు తీసుకుంటాం : జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 04 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల శివారులోని మహాత్మ జ్యోతిరావు పూలే సంక్షేమ బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో చదువుకుంటున్న రాజు అనే విద్యార్థి వసతి గృహ శివారులో ఉన్న చెరువులో పడి మృతి చెందాడు.తీవ్రంగా గాలించిన ఎన్డిఆర్ఎఫ్ బృందాలు బుధవారం రాజు డెడ్ బాడీని వెలికి తీశాయి.వసతి గృహ సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే తమ కుమారుడి ప్రాణం పోయిందని రాజు తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన చేపట్టడంతో ఘటన స్థలానికి చేరుకున్న మహబూబ్ నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ వివరాలు తెలుసుకొని కుటుంబానికి 7 లక్షలయాభై వేలు ఎగ్జిగ్రేషియో చెల్లిస్తున్నట్లు, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇందిరమ్మ ఇల్లు కలిపిస్తున్నట్టు ప్రకటించారు.అదే విధంగా వసతి గృహ సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఘటన స్థలంలో షాద్ నగర్ ఆర్డీఓ ఆర్ఎన్.సరిత తో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ పట్టణ సిఐ విజయ్ కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## రాష్ట్ర మున్నూరు కాపు సంఘం (పటేల్స్) యూత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టీ రాజ్ కుమార్

**ముషీరాబాద్, మార్చ్ 04 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం (పటేల్స్) యూత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా టీ రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవిలో నియమించినందుకు సంఘానికి, సంఘ అభివృద్ధికి శాయ శక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవర్ అయినా హైదరాబాద్ అచ్చులు మహేందర్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆర్థిక సహాయం

## లక్ష్మణ్ రావు గూడ సర్పంచ్ శ్రీరంగం కుమార్, ఉప సర్పంచ్ బొబ్బిలి చెన్నారెడ్డి



**షాబాద్, మార్చి 04(జనంసాక్షి) :** గ్రామంలో నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటానని సర్పంచ్ శ్రీరంగం కుమార్, ఉప సర్పంచ్ బొబ్బిలి చెన్నారెడ్డి అన్నారు. గ్రామంలోని నిరుపేద జోగు పెద్ద వెంకటయ్య మంగళవారం హఠాత్ మరణం చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబానికి 15000 రూపాయల ఆర్థిక సాయం తక్షణమే అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామంలోని నిరుపేద కుటుంబీకులకు ఆపదలోనూ ముందు నిలుస్తామని అన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మరికొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామ పెద్దలు మాట్లాడుతూ...జోగు పెద్ద వెంకటయ్య సాదాసీదా జీవితం గడిపిన వ్యక్తి అని, గ్రామ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. పేదవారికి అత్యవసర నిధి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు సూచించారు. అంత్యక్రియల కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రంగుల రంగుల ఆనందోత్సవాలువెల్చల్
# గ్రామంలో ఘనంగా హోలీ వేడుకలు




**మోమిన్ పేట మార్చి 04 (జనంసాక్షి):** మోమిన్ పేట మండల పరిధిలోని వెల్చల్ గ్రామంలో హోలీ పండుగ వేడుకలు రంగురంగుల ఆనందోత్సవాల మధ్య గ్రామ యువకులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు ఈ హోలీ వేడుకల్లో డీజే సౌండ్ లతో డ్యాన్సులుచేస్తూ గ్రామానికి చెందిన యువకులు రాజకీయాల అతీతంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు కుల మతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు గ్రామానికి చెందిన నియోజకవర్గ సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి గ్రామ ఉపసర్పంచ్ రాజుల రమేష్ మాజీ ఉపసర్పంచ్ జనార్ధన్ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ప్రవీణ్ గౌడ్, యువజన సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆనంద్ ఉత్సవాల మధ్య ఘనంగా హోలీ పండుగను జరుపుకున్నారు యువకులు ఒకరిపై ఒక రంగులు చల్లుకుంటూ ఆనందంగా జరుపుకున్నారు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో హోలీ వేడుకలు ప్రశాంతంగా ముగించాయి.

# సబ్సిడీపై అగ్రో డ్రోన్లు

## షాబాద్ మండలం వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర

**షాబాద్, మార్చి 04 (జనంసాక్షి) :** రైతులు వ్యవసాయ సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర అన్నారు. తెలంగాణ ప్రభుత్వం - ఎస్ఎమ్ఏఎమ్ 2025 -26 కింద ఎఫ్పిఓఎస్, పిఎసిఎస్, ఎస్హెచ్జిఎస్ కు అగ్రిడ్రోన్లపై 40% సబ్సిడీని అందుబాటులోకి తీసుకొచ్చిందని సభ్యులు మార్చి 15 వరకు అగ్రికల్చర్ ఆఫీసులో దరఖాస్తులు చేసుకోగలరని బుధవారం ఒక ప్రకటనలు తెలిపారు.

# చిల్కానగర్ విభాగంలోని బీరప్పగడ్డలో సిమెంటు రహదారి పనుల పర్యవేక్షణ

## రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సూచనలు



**ఉప్పల్ మార్చి 04 (జనంసాక్షి):** చిల్కానగర్ విభాగ పరిధిలోని బీరప్పగడ్డ ప్రాంతంలో కొనసాగుతున్న సిమెంటు రహదారి నిర్మాణ పనులను భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పరిశీలించారు. తులసి డాక్టర్ వీధి , బూచి రెడ్డి వీధుల్లో నూతనంగా నిర్మిస్తున్న సిమెంటు రహదారుల పనుల పురోగతిని ఆయన సమగ్రంగా పరిశీలించి అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ, చిల్కానగర్ విభాగంలోని పలు కాలనీలలో ఆమోదం పొందిన సిమెంటు రహదారి పనులను దశల వారీగా పూర్తి చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న ఆమోదం పొందని పనులను కూడా ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సహకారంతో త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రహదారి నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్‌కు జారీ చేసిన పనుల ఆదేశ పత్రంలో పేర్కొన్న ప్రతీ అంశాన్ని ఖచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా రహదారి వెడల్పు కనీసం నాలుగు మీటర్ల యాభై సెంటీమీటర్ల మేర ఉండేలా నిర్మాణం చేయాలని, స్థలాభావం ఉన్నచోట అవసరమైతే రహదారి పొడవును పెంచే విధంగా మార్పులు చేయాలని సూచించారు. అదేవిధంగా నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, దీర్ఘకాలం నిలిచేలా రహదారి నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. కాలనీ వాసులకు నిర్మాణ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. అలాగే మహానగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగ అధికారులు నిర్మాణ సమయంలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని, పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పనుల పరిశీలకుడు కేదార్, సీనియర్ నాయకులు కోకొండ జగన్, తిరుపతి యాదవ్, ఏదుల్ల కొండల్ రెడ్డి, వంజరి నర్సింగ్ రావు, పండ్ల కిషన్, బంటి గౌడ్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, బాలు, రవి, సురేష్, బస్తి వాసులు యాదమ్మ, కృప, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిల్కానగర్ విభాగ అభివృద్ధి దిశగా సిమెంటు రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని నాయకులు తెలిపారు.

# హోలీ రంగులు ప్రతిఒక్కరి జీవితాల్లో ఆనందమయం చేయాలి





- అంబరానంటిన హోలీ సంబరాలు
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్

**తాండూరు మార్చి 4 (జనంసాక్షి):** హోలీ రంగులు ప్రతిఒక్కరి జీవితాల్లో ఆనందమయం చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ పేర్కొన్నారు. తాండూరు పట్టణంలో బుధవారం హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. పట్టణంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ తన కుటుంబ సభ్యులతో కలిసి హోలీ సంబరాలు జరుపుకున్నారు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ వైభోగంగా హోలీ వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ఏడ వాడు ఎన్టీఆర్ కాలనీలో కౌన్సిలర్ ఇర్షద్ ఆద్వర్యంలో హోలీ వేడుకలు జరుపుకున్నారు. కుల మతాలకు అతీతంగా హోలీ వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషకరమన్నారు. అదేవిధంగా పట్టణంలోని గుమస్తా నగర్ లో చిన్నారులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల నాయక్ మాట్లాడుతూ .. హోలీ సంబరాలు అంటే పేద,ధనిక అని తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకోవడం కులమతాలకతీతంగా ప్రజలందరూ మహిళలు యువకులు ఒకరికొకరు రంగుల హోలీ వేడుక అన్నారు. మన సాంప్రదాయాలు, మరువకూడదని భవిష్యత్తులో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను పెద్ద ఎత్తున పండుగలు జరుపుకోవాలని పేర్కొన్నారు.



సికింద్రాబాద్ (జనంసాక్షి): కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మదా మల్లికార్జున్ నివాసం వద్ద హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ , మహిళా కార్మికులు , కుటుంబ సభ్యులతో రంగులు చల్లుకుంటూ, స్టెప్పులేశారు. ఈ వేడుకల్లో బిజెపి సీనియర్ నాయకులు బానుక మల్లికార్జున్, బి.ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



లోయర్ ట్యాంక్ బండ్ ఇందిరా పార్క్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ.



# విద్యార్థుల ప్రోత్సాహం - భక్తి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్ మార్చి 04 (జనంసాక్షి):** హైదరాబాద్ నగరంలోని హబ్సిగూడ వీధి నంబర్ ఒకటిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. భారత రాష్ట్ర సమితి హబ్సి గూడ విభాగ నాయకురాలు రజిత రెడ్డి ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, తల్లిదండ్రులు, గురువులు మరియు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. విద్యాభివృద్ధి కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, కైలాష్ పతి గౌడ్, మనోహర్ దినేష్ కుమార్, లక్ష్మి, నళిని రెడ్డి, శ్రుతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రామంతపూర్ ఇందిరానగర్ ప్రాంతంలోని శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ ధార్మిక కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు, భారత రాష్ట్ర సమితి నాయకులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజా సేవా కార్యక్రమాలు, విద్యా ప్రోత్సాహం , ధార్మిక కార్య క్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సేవా దృక్పథాన్ని మరొక్కసారి చాటిచెప్పారు.

# మండలంలో ఘనంగా హోలీ వేడుకలు



**మర్పల్లి మార్చి 04 (జనంసాక్షి):** మండల కేంద్రంలో హోలీ పండుగను బుధవారం గ్రామ యువత , పెద్దలు, మహిళలు అత్యంత ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామ వీధుల్లో రంగుల హోరు కనిపించింది. చిన్నారులు, యువకులు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగిపోయారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ప్రత్యేకంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని హోలీ సంబరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డీజే పాటలకు యువకులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేయగా, గ్రామస్తులు ఆ ఉత్సాహాన్ని ఆస్వాదించారు. సంప్రదాయబద్ధంగా హోలీ దహనం కార్యక్రమం సోమవారం నిర్వహించి చెడును దహనం చేసి మంచిని ఆహ్వానించే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామేశ్వర్ వేడుకల్లో పాల్గొని యువతతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొని ఉత్సాహపరిచారు. గ్రామ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ సోదరభావం, ఐక్యత, పరస్పర గౌరవం వంటి విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో శాంతి, సామరస్యాలు కొనసాగాలని ఆకాంక్షించారు.మహిళలు, పిల్లలు కూడా ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు మరింత అందం చేకూర్చారు. ఈ సంబరాల్లో ఉప సర్పంచ్ కొప్పుల ప్రభు, మాజీ ఎంపిటిసి శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ పాండు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పరి నాగేష్, సర్వేష్, నర్సింలు యాదవ్, అంతు గారి మధుసూదన్ రెడ్డి, వడ్ల వెంకటేశం, పంతులు బావి శ్రీను, తిరుపతి, ఉగేల్లి రవీందర్ రెడ్డి, బక్క మహిపాల్, పబ్బే వసంత్, బబ్లు, పసుల మారుతి,  నీలి శ్రీకాంత్, వినోద్ సామి, జైపాల్ రెడ్డి, గ్రామ యువకులు పెద్దలు ఉత్సాహంగా పాల్గొని హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

# బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన మన్నె రాజు



**నిజాంపేట్ (జనంసాక్షి):** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం  బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మత్స్య శాఖ ,కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నే రాజు.  బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, లా ఆధ్వర్యంలో,  టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్  డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్‌ల  సమక్షంలో ఆయనకు పార్టీ కండువా వేసి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి లక్ష్యంగా  ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు  చేపట్టుచు ప్రభుత్వం  సుపరరిపాలన కు ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. ఈ పరిణామం కుత్బుల్లాపూర్ రాజకీయాల్లో  బిఆర్ ఎస్ పార్టీ పై ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయం చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి,, కే ఎం గౌరీష్, లక్ష్మ రెడ్డి, రషీద్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బట్ట పాల కృష్ణ,సిద్దనోల సంజీవరెడ్డి , మైసిగారి శ్రీనివాస్, బైరీ ప్రశాంత్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్, ముత్యం రెడ్డి రావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ లావని పట్టా భూమిని ప్రైవేట్ వ్యక్తుల ఆక్రమణను నియంత్రించి కాపాడాలి



**నిజాంపేట్ మార్చి 04 (జనంసాక్షి):** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం రావణ్ నిజాంపేట్‌లో 13 ఎకరాల లావణి పట్టా ప్రభుత్వ భూమి పై కొందరు ప్రవీణ్ ప్రైవేటు వ్యక్తులు కన్నేసి ఆక్రమించేందుకు ఇటీవల 5 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు సమాచారం ఉందని, ప్రభుత్వం అట్టి భూమి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కాపాడాలని  ఆకుల సతీష్ ఆరోపించారు. నిజాంపేట్ గ్రామం సర్వే నెంబర్లు 233/21, 22, 23, 24, 25, 26లలో ఉన్న దాదాపు 15 ఎకరాల ప్రభుత్వ లావణ భూమిపై భారీ అక్రమాల ప్రయత్నం జరుగుతోందని ఆకుల సతీష్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం బాచుపల్లి తాసిల్దార్ వాణి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే సర్వే నంబర్లలో(233/22) సుమారు 2 ఎకరాల ప్రభుత్వ భూమిని తప్పుడు ఎన్ఓసి ఆధారంగా కల్వకుంట్ల కన్నారావు 2023లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మిగిలిన 13 ఎకరాల ప్రభుత్వ లావణ భూమిని(233/23,24,25,26,27) అధికార పార్టీ నేతల సహకారంతో ఇద్దరు పెద్ద బిల్డర్లు రూ.5 కోట్ల కొంత అడ్వాన్స్ పేమెంట్ గా అమౌంట్ చెల్లించి త్వరలో స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ విషయంపై ఇప్పటికే సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగిందని హలో తెలిపారు. సుమారు రూపాయలు 300 కోట్ల విలువైన ఈ 13 ఎకరాల ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రైవేట్ వ్యక్తులు హైకోర్టులో పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉంచారని, గతంలో కల్వకుంట్ల కన్నారావు ఎకరం పైచిలుకు భూమిని ఆక్రమిం చుకున్నారని, ప్రస్తుతం మిగిలిన 13 ఎకరాల భూమిని నిర్మాణానికి అనుకూలంగా చేస్తామని అధికార పార్టీ నేతలు హామీ ఇవ్వడంతో ఇద్దరు బడా బిల్డర్లు 5 కోట్ల మొదటి టోకెన్ చెల్లించినట్లు సమాచారం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే అక్కడ చిన్నచిన్న షెడ్లు/డబ్బాలు తొలగించాలి. ఇటీవల ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు హైడ్రా కాపాడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ భూమి మరింత ఆక్రమణకు గురికాకుండా (హైడ్రా) ద్వారా ఫెన్సింగ్ వేయాలని తెలిపారు. అలాగే కోర్టులో సరైన కౌంటర్లు దాఖలు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలి. ఈ స్థలాన్ని కాపాడినట్లయితే నిజాంపేట్ సర్కిల్ ప్రజల కోసం స్టేడియం, ప్రభుత్వ ఆసుపత్రి లేదా కాలేజీ నిర్మాణానికి కేటాయించి నట్లయితే ఉపయోగ పడుతుందని తెలిపారు.  ఈ కార్యక్రమంలో ప్రసాద్, అరుణ్ రావు, నవీన్, రమేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా హోలీ వేడుకలు

## చిన్నారులు, కార్యకర్తల మధ్య డప్పుకొట్టి స్టెప్పులేసిన మల్లారెడ్డి

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ప్రతి ఒక్కరి జీవితాలు సుఖసంతోషాలు రంగులు వికసించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆకాంక్షించారు. హోలీ పండుగ మత సామరస్యానికి, స్నేహభావానికి ప్రతీకగా ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన సూచించారు. హోలీ పండుగను పురస్కరించుకొని బోయిన పల్లిలోని ఆయన  క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, చిన్నారులతో కలిసి ఘనంగా హోలీ సంబరాలు జరుపుకున్నారు. చిన్నారులు, కార్యకర్తలతో కలిసి రంగులు చల్లుకొని, డప్పుకొట్టి స్టెప్పులేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి పండగ కులమతాలకతీతంగా జరుపుకుంటూ ఐక్యతను చాటిచెప్పాలన్నారు. తాను యువతకు ఆదర్శమని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రతి ఒక్కరు పండగలు జరుపుకోవాలన్నారు.  ఈ కార్యక్రమంలో బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్. శ్రీనివాస్, మాజీ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నగేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కులు మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌టు తుల్జాపూర్ పుణ్యక్షేత్ర టూర్ ప్యాకేజ్ ప్రకటించిన పికెట్ డిపో




**సికింద్రాబాద్(జనంసాక్షి):** పుణ్యక్షేత్ర దర్శనాలకు వెళ్లాలనుకునే భక్తుల కోసం పికెట్ డిపో ఆధ్వర్యంలో హైదరాబాద్ నుండి తుల్జాపూర్ వరకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఈనెల13 వ తేదీ నుండి నడపనున్నారు. ఈ యాత్రలో గానగాపూర్ దత్తాత్రేయ దేవాలయం, కొల్హాపూర్ మహాలక్ష్మి దేవాలయం, పండర్పూర్ విట్టల్ దేవాలయం మరియు తుల్జా భవాని దేవాలయం దర్శనములు కల్పించనున్నారు. జూబ్లీ బస్ స్టేషన్ నుండి రాత్రి 8 గంటలకు, ఎంజీబీఎస్ నుండి రాత్రి 9 గంటలకు బయలుదేరే ఈ బస్సు యాత్ర అనంతరం సోమవారం ఉదయం 5 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. సర్వీసు నెంబర్ 95565 కాగా, ఒక్కొక్కరికి రూ.3,500 చార్జి నిర్ణయించారు. ఆసక్తిగల భక్తులు పికెట్ డిపోను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడిని ఆపాలి

- భారత ప్రభుత్వం నోరు మెదపకుండా ఉండడం అన్యాయం
- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్




**ముషీరాబాద్, మార్చ్ 04 (జనంసాక్షి):** ఇరాన్ పై సామ్రాజ్యవాద అమెరికా , యూద దురహంకార ఇజ్రాయిల్ దాడి చేసి వందలాది మంది సాధారణ పౌరులను హత మార్చడాన్ని ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. వెంటనే దాడులను ఆపేయాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ ఆవాజ్ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలను, ఇరాన్ దేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించి దాడి చేయడం హేయమైన చర్యని, అంతర్జాతీయ సమాజం ఈ దుర్మార్గాన్ని తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. అమెరికా సామ్రాజ్యవాద ఆగడాలకు అడ్డు, అదుపు లేకుండా పోతుందని గత నెలలోనే వెనిజులా అధ్యక్షుడు మధురోని కిడ్నాప్ చేసి న్యూయార్క్ లో నిర్బంధించిందని, ఇప్పుడు ఇరాన్ సుప్రీం లీడర్ గా ఉన్న ఆయతుల్లా ఖమేనిని బాంబు దాడులతో హతమార్చిందని అన్నారు. గతంలో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ను, లెబనాన్ అధ్యక్షుడు గడాఫీని ఇదేవిధంగా హత్య చేసిన సంఘటనలను ఆయన గుర్తు చేశారు. ఖనిజాలు, సహజ వనరులపై, ఆయిల్ నిల్వలపై కన్నేసిన అమెరికా, ఇరాన్ ను ఎలాగైనా తన దారిలోకి తెచ్చుకొని అక్కడున్న ఆయిల్ నిల్వలను కొల్లగొట్టాలనే దురుద్దేశంతోటే ఇజ్రాయిల్ తో కలిసి దాడులకు పాల్పడిందని అన్నారు. ఇజ్రాయిల్, అమెరికా కలిసి పాలస్తీనాను స్మశానంగా మార్చాయని, ఇప్పుడు ఇరాన్ పై గురిపెట్టేయాని విమర్శించారు. తమ స్వార్ధ ప్రయోజనాల కోసం యుద్ధాలు చేసి సాధారణ ప్రజలను హతమార్చడం అన్యాయం అన్నారు. ఎంతో కాలంగా భారతదేశానికి మిత్ర దేశంగా కొనసాగుతున్న ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి చేసిన భారత ప్రభుత్వం నోరు మెదపకుండా ఉండడం అన్యాయమని అన్నారు. అమెరికాకు భయపడి నరేంద్ర మోడీ నోరు మూసుకొని ఉంటున్నాడని, యుద్ధం వల్ల పశ్చిమాసియాలో పని చేస్తున్న కోటి మంది భారతీయులకు ఉపాధి పోయే అవకాశం ఉందని, దిగుమతులపై పెద్ద ఎత్తున ధరలు పెరిగి భారత ప్రజలపై భారం పడే అవకాశం ఉందని, అందుకే యుద్ధాన్ని నివారించడానికి భారత ప్రభుత్వం మాట్లాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజాస్వామిక విలువలకి తిలోదకాలు ఇచ్చి అమెరికన్ సామ్రాజ్యవాదం ఏ దేశం పైనైనా దాడి చేసే హక్కు తనకు ఉందనే పేరుతో దేశాలపై ఈ రకంగా దాడులు చేస్తూ వాటి సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తూ, వారి స్వేచ్ఛని హరిస్తున్నది. ఆయా దేశాల్లోని వనరులని దోపిడీ చేస్తున్నది. ఒక స్వతంత్ర దేశంగా భారతదేశం అమెరికా సామ్రాజ్యవాద దురాహంకారాన్ని ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. భారత ప్రభుత్వం వెంటనే స్పందించి అమెరికా, ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని ఖండించాలన్నారు. ప్రజాస్వామ్య దేశాలతో కలిసి యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అజీజ్ అహమ్మద్ ఖాన్, మహమ్మద్ అలీ, ఇమామ్, కృష్ణ స్వామి, ఇబ్రహీం, పాల్గొన్నారు.

# స్వరూప్ నగర్‌లో రూ.1.82 కోట్లతో సిమెంటు రహదారి నిర్మాణం

### మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్ మార్చి 04 (జనంసాక్షి):** ఉప్పల్ విభాగ పరిధిలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో రూ.1.82 కోట్ల వ్యయంతో సిమెంటు రహదారి నిర్మాణ పనులను చేపడుతున్నట్లు మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రాంతీయ అభివృద్ధి దిశగా ఈ పనులు కీలకంగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.ఇప్పటికే రూ.69 లక్షల వ్యయంతో భూగర్భ కాలువల నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే ఉద్దేశంతో ఈ పనులను ముందుగా చేపట్టినట్లు చెప్పారు. భూగర్భ కాలువల నిర్మాణం పూర్తయ్యాక రహదారి నిర్మాణాన్ని చేపట్టడం ద్వారా భవిష్యత్తులో రోడ్లు మళ్లీ తవ్వాల్సిన అవసరం లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. బుధవారం స్వరూప్ నగర్‌లో కాలనీ వాసులతో కలిసి సిమెంటు రహదారి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్దిష్ట ప్రమాణాలను పాటిస్తూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతోందని రజిత పరమేశ్వర్ రెడ్డి



పేర్కొన్నారు. ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ ప్రతి ప్రాంతానికీ సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు వేగంగా అమలవుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్వరూప్ నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, సిద్దేశ్వర్, పూజారి హనుమంతు, సల్ల ప్రభాకర్ రెడ్డి, అమరేందర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, జ్ఞానేశ్వర్, సత్యనారాయణ, ఆనంద్ ప్రభు, కుమార్, పిసటి అంజి రెడ్డి, వెంకటేష్, రాకేష్ నాయక్, సురేష్, పవన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులు అధైర్య పడవద్దు అండగా నిలుస్తాం

– బిఆర్ఎస్ ఎల్పి విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**నిజాంపేట్ (జనంసాక్షి):** అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం సంభవించిన చిరు వ్యాపారులకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే వివేకానంద్ బాధితులు అధైర్య పడవద్దని ఆదుకుంటాం మనీ తెలిపారు. కుతుబుల్లాపూర్ నియోజక వర్గం బాచుపల్లి ప్రధాన రహదారి లోని కేజీఆర్ కన్వెన్షన్ వద్ద గల బాచుపల్లి ప్రధాన రహదారి పక్కన గల ఫర్నిచర్ దుకాణాలలో మంగళ వారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంతో రోడ్డున పడ్డ ఫర్నిచర్ షాప్ బాధితులను, సంఘటన స్థలాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పరామర్శించి బాధితులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవనోపాధి కోసం చిన్న చిన్న దుకాణాలను ఏర్పాటుచేసి వ్యాపారాలు నిర్వహిస్తున్న వీరికి ఇలాంటి ఆకస్మాత్తు ప్రమాదాలు తీవ్ర ఆస్తి నష్టాన్ని కలిగించాయని, జిల్లా ఉన్నతాధికారులతో ఘటనపై చర్చించి బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టి వారిని అందుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్



యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ రవికిరణ్, గాజుల సుజాత, స్ధానిక నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్తా, ప్రదీప్, వైఎస్, కురుమూర్తి, అంజన్ కుమార్, రవీందర్ బాబు, జయరాజ్, మహిళా నాయకురాలు లలితా రెడ్డి, క్రిష్ణ మంజరి పాల్గొన్నారు.

## కేజీబీవీకి సౌండ్ సిస్టమ్ అందజేత



**చేవెళ్ల, మార్చి 04 (జనంసాక్షి):** చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో భాజపా చేవెళ్ల నాయకులు అతెల్లి మధుసూదన్ రెడ్డి సాహితీ దంపతుల కుమారుడు అనిరుద్ రెడ్డి జన్మదిన వేడుకలు విద్యార్థుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.20 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను విద్యాలయానికి అందజేశారు. విద్యార్థినుల విద్యా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సౌండ్ సిస్టమ్ ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థినులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల అవసరాలను గుర్తించి సహకారం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి సమాజం నుంచి వస్తున్న మద్దతు ఎంతో ప్రోత్సాహకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంత్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులు దాతలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ జడ్పీటీసీ మహంకాళి అనితకు గౌరవ డాక్టరేట్



**శామీర్ పేట,మార్చి 3 (జనంసాక్షి):** సామజిక కార్యకర్తగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా శామీర్ పేట్ అభివృద్ధిలో తనదైన శైలిని ప్రదర్శిస్తూ మండలంలోని ప్రజలే కాకుండా మేడ్చల్ నియోజక వర్గంలో ఎంతో మందికి చేయూతనిస్తూ ఎన్నో విజయాలను సాధించిన శామీర్ పేట మాజీ జడ్పిటిసి మహంకాళి అనితను గౌరవ డాక్టరేట్ అవార్డుతో సత్కరించారు. గత నెల 28న శని వారం ఎషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ హోసూరు వారు శామీర్ పేట మాజీ జడ్పిటిసి మహంకాళి అనిత ఒక సామాజిక స్పృహ కల్గిన వ్యక్తిగాఎంతో మంది బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉపాధి, రాజకీయ రంగంలో ఆమె సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. తమిళనాడు హోసూరు లో జరిగిన కార్యక్రమంలో శామీర్ పేట్ మాజీ జడ్పిటిసి మహంకాళి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం పట్ల సామాజిక కార్య కర్తలు, రాజకీయ నాయకులు, రైతులు, రైతు సంఘాలు, కార్యకర్తలు, మేధావులు ప్రముఖ పాత్రి కేయులు ఇతర రంగాలకు చెందిన వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహంకాళి అనిత మాట్లాడుతూ..తనకు గౌరవ డాక్టరేట్ అవార్డు వరించడం ఎంతో ఆనందానికి గురిచేసిందన్నారు . యూనివర్సిటీ వారికి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా శామీర్ పేట్ ప్రజలకు తన శ్రేయోభిలాషులకు, పాత్రికేయులకు మిత్రులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం



**మర్పల్లి (జనంసాక్షి):** ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని, జెకె ఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో 25 మంది పేద విద్యార్థులకు రూపాయలు 2500/- చొప్పున స్కాలర్షిప్ చెక్కులను బుధవారం పంపిణీ చేశామని మండల బిజెపి అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలోబిజెపి మండల అధ్యక్షులు. పి రామేశ్వర్ రెడ్డి. కెవిఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్. శేఖర్ మరియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్. మండల్ వైస్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి. వీరన్న మధు ప్రవీణ్ , విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ పూజలు ప్రారంభం

## ప్రారంభ పూజల్లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

**శామీర్ పేట, మార్చి 4 (జనంసాక్షి) :** శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ పూజలు కన్నుల పండువగా ప్రారంభించారు. మూడు చింతలపల్లి మున్సిపాలిటీలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని తీగుళ్ల సంతోష్ శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య ఘనంగా ప్రారంభించారు. బుధవారం ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనము, అంఖురారో పనము, అఖండ దీపారాధన, ఋత్విక్ వరుణం, దీక్షా ధారన, అమ్మవారి ఊరేగింపు, యాగశాల ప్రవేశము నిర్వహించారు. సాయంత్రం మంట పదేవతాస్థాపనము, అగ్నిప్రతిష్ట, ఆవాహిత దేవతా హోమాలు, జలాధివాసము, హారతి, తీర్థప్రసాద వితరణము చేశారు.

**పూజల్లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ :**
ముడుచింతలపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్య ంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ ఈటల మాట్లాడుతూ.. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ, సమాజ ఐక్యత కోసం ముదిరాజ్ సోదరులు చేస్తున్న కృషి అభినందనీయ మన్నారు. గ్రామాభివృద్ధి కోసం, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. అమ్మవారి అనుగ్రహం మనందరిపై ఎల్లవేళలా ఉండాలని, నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మూడు చింతపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి, కౌన్సిలర్లు నీరజ్ గౌడ్, నవీన్ నాయక్, చినలచ్చి సరిత శ్రీనివాస్ గౌడ్, ముదిరాజ్ సంఘం సభ్యులు, ఉమ్మడి శామీర్ పేట మండల మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, వంగ లక్ష్మారెడ్డి మూడు చింతలపల్లి మండల అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్ గౌడ్, జనరల్ సెక్రటరీ లు శ్రీకాంత్ రెడ్డి, శ్రీశైలం, ఉపాధ్యక్షురాలు సింగం విజయలక్ష్మి, రమ్య, వంగ రవీందర్ రెడ్డి, సుధాకర్ నాయక్, వీరేష్ నాయక్, రాయ్ శ్రీకాంత్ రెడ్డి, అరుణ్, నరేష్ పటేల్, గూగుల్ లోతు వెంకటేష్ నాయక్, మచ్చేందర్ రెడ్డి, రవి, మున్సిపల్ వాసులు పాల్గొన్నారు.

# అనూష మృతి పై విచారణ జరపాలి : ప్రజా సంఘాలు

**మోమిన్ పేట (జనంసాక్షి):** గిరిజన బాలిక అనూష మృతి పై విచారణ జరపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ భూ యజమాని అంతమొల్ల దయాకర్ రెడ్డి బలవంతంగా 14 సంవత్సరాలు నిండని అనూషతో పనిచేయించుకోవడం వల్లనే ఆమె మృతి చెందిందని అన్నారు. స్వయానా రాజకీయ నాయకుడైన ఆయన బాధితుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారికి అతి తక్కువ వేతనం చెల్లిస్తూ పని చేయించుకున్నారని తెలిపారు. పనికి వెళుతున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడి గిరిజన బాలిక అనూష మృతి చెందడానికి దయాకర్ రెడ్డి పూర్తి బాధ్యుడని పేర్కొన్నారు. పోలీసులు మాత్రం దీనిని సాధారణ యాక్సిడెంట్ కేసుగా నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఆమెను బాల కార్మికురాలిగా నిర్ధారించడంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. రాజకీ



య అండదండలు ఉండడంతోనే దయాకర్ రెడ్డి పై బాలల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేయడానికి పోలీసులు వెనుకాడుతున్నారని అన్నారు. అధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి ఆమెను బాల కార్మికురాలిగా గుర్తిస్తూ బాధ్యుడైన దయాకర్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలోనే నవాబ్ పేట్ మండల కేంద్రంలో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పోరాటానికి కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీత, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ బి.శివరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుట్టకింది రవికుమార్, విహెచ్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీకాంత్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉమ, జామ దశరథ్, శ్రీనివాస్, బి.నరేందర్, ఎ.మల్లేష్, పి.రమేష్ పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రాపర్టీ టాక్స్‌కు ఓటీఎస్ పథకం

- **రూ.10వేల లోపు వడ్డీ బకాయిలుంటే పూర్తి మినహాయింపు..**
- **వడ్డీ రూ.10వేల కంటే ఎక్కువ ఉంటే రూ.30శాతం రాయితి**

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పెండింగులో ఉన్న ఆస్తి పన్ను బకాయిల క్లియ రెన్స్కోసం బోర్డు వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. కంటోన్మెంట్స్ చట్టం, 2006 నిబంధనల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సం మార్చి 31వరకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిల ఆస్థి పన్ను యజమానులు చెల్లించవచ్చు. ఈ ప్రతిపాదిత పథకం ఆస్తి పన్ను బకాయిలపై పేరుకు పోయిన వడ్డీ భాగంపై రాయితీని పొందవచ్చని అధికారులు వెల్లడించారు. దీని వల్ల బోర్డుకు రావా ల్సిన బకాయిలు రాబట్టడం,మరో వైపు బకాయిలను స్వచ్ఛందంగా చెల్లించడం ద్వారా బకాయిలపై పేరుకు పోయిన వడ్డీకి మినహాయింపు పొందవచ్చని తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలలో వడ్డీ మొత్తంపై 30శాతం రాయితీ, లేదా రూ.10వేలు వరకు రాయితి కల్పిస్తారు. పెండింగ్ బకాయిలపై వడ్డీ మొత్తం రూ.10వేల లోపు ఉంటే వడ్డీ మొత్తానికి రాయితి ఇస్తారు. ఈ రాయితి పెండింగులో ఉన్న ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీకి మాత్రమే వర్తిస్తుందని అధికారులు తెలిపారు.అయితే రాయితి బకాయిలతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలను పూర్తిగా




చెల్లించినట్లయితే మాత్రమే ప్రయోజనం లభిస్తుందని తెలిపారు.ఈ పథంక మార్చి 31 వరకు అమలులో ఉంటుందని, పెండింగ్ బకాయిలు ఉన్న అన్ని ఆస్తి యజమా నులు ఈ అవకా శాన్ని ఉప యో గించుకుని, వడ్డీ, రికవరీ ప్రక్రియలు మరింతగా పేరుకు పోకుండా ఉండటానికి నిర్ణీత సమయంలోపు వారి బకాయిలను క్లియర్ చేయాలని కోరారు.

# మహిళా కమిషన్కు బిసి ఎస్సి ఎస్టి జేఏసీ వినతి



**ముషీరాబాద్, మార్చ్ 04 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ కుమ్మెర గ్రామంలో జరిగిన ఘటనలో బాధితులకు ఇంతవరకు న్యాయం జరగలేదని, తక్షణమే తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చొరవ తీసుకొని బాధిత మహిళలకు న్యాయం చేయాలని, నిందితులను అరెస్టు చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రటరీ కి బీసీ,ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, పిఓడబ్ల్యూ కన్వీనర్ సంధ్య , బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఉపాధ్యక్షులు రాసాల వినోద్ యాదవ్, హరప్ప మహారాజ్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు సాయి మహారాజ్,ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిముందు పాయసం కుండలు..

# పోటీపడి ఎత్తుకెళ్లిన పెండ్లిడుకోచ్చిన కుర్రాళ్ళు

## బొట్లవానితండాలో ముగిసిన హోలీ సంబరాలు



**బొంరాస్ పేట, మార్చి 4 (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లా పరిధిలోని బొంరాస్ పేట మండలం బొట్లవానితండాలో గిరిజనులు నిర్వహించే హోలీ వేడుకల్లో భాగంగా ధూండ్ పండుగను రమావత్ గోత్రానికి చెందిన గిరిజనులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం.గత వారం రోజుల నుండి జరుగుతున్న పండుగ బుధవారంతో ముగిసింది.చిన్నపిల్లల ఆరోగ్యం, దీర్ఘాయువు కోసం ప్రార్థించడం, సామాజిక ఐక్యతను పెంచడం,కుటుంబానికి సుఖ, సంతోషాలు కలగాలని కోరుకోవడం భవిష్యత్తులో లంబాడా సంస్కృతి సంప్రదాయాలను పాటించడం దుండ్ పండుగ ఉద్దేశమని గిరిజన పెద్దలు తెలిపారు. బుధవారం ఉదయం పాయసంతో కూడిన కుండను కర్రలకు తాడు సహాయంతో కట్టి ఉంచారు.తండాలో పెండ్లిడుకోచ్చిన యువకులు పోటీపడి పాయసం కుండాలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు.ఆ సమయంలో మహిళలు పాయసం ఎత్తుకెళుతున్న యువకులను కర్రలతో కొడుతుండగా దెబ్బలకు తట్టుకొని మరి పాయసం కుండలను పోటీపడి ఎత్తుకెళ్లి పాయసం తిన్నారు.అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు నెహ్రూ నాయక్ ,సర్పంచ్ బాలునాయక్, ఉపసర్పంచ్ రవి నాయక్,మాజీ ఎంపిటిసి మోతీబాయి,మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్,కల్యనాయక్,రవి నాయక్, శంకర్ నాయక్,దేశ్య నాయక్,సూర్య నాయక్,లక్ష్మణ్ నాయక్, ,ఫుల్ సింగ్, కిషన్ ,సుభాష్, వినోద్, పాల్గొన్నారు.

## టేకులపల్లి గ్రామంలో

# ఘనంగా హోలీ పండుగ వేడుకలు

**మోమిన్ పేట (జనంసాక్షి):** మోమిన్ పెట్ మండల పరిధిలోని టేకులపల్లి గ్రామంలో హోలీ సంబరాల్లో పాల్గొన్న సర్పంచ్ బండ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా హోలీ వేడుకలు నిర్వహించారు మంగళవారం రాత్రి అన్నం చేసి బుధవారం హోలీ వేడుకలు నిర్వహించారు గ్రామ యువకులు రాజకీయాల కతీతంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నార రంగురంగుల కలర్ ఒకరిపై ఒకరు పోసుకొని హోలీ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# బికేఆర్ ఫౌండేషన్ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్, పెన్నుల పంపిణీ



**నిజాంపేట్ (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ ,గాగిల్లాపూర్ ,మల్లంపేట్ ,బౌరంపేట్, బహదూర్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్ పెన్నులను పంపిణీ చేసిన బి కే ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం 10వ తరగతి తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థిని విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు ప్రథమ ద్వితీయతృతీయ స్థానాలు సాధించిన వారికి తమ ట్రస్ట్ ద్వారా బహుమతులు ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తామని తెలియజేశారు అదేవిధంగా మధ్యతరగతి పేద విద్యార్థులకు అండగా ఉండి వారి చదువుకు అన్ని విధాల బికేఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని తెలియజేశారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ రెడ్డి మాజీ సర్పంచ్ కావలి గణేష్ మల్లేష్ యాదవ్ ,ఏఆర్ సాధు యాదవ్ ,బెంబిడి మహేందర్ రెడ్డి , విజయ్ గౌడ్, వేణు ,కుమార్, శ్రీనివాస్ శ్రీకాంత్ రెడ్డి. పిట్ల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబరానంటిన హోలీ సంబరాలు

## యాలాల మండల కేంద్రంలో ఘనంగా హోలీ సంబరాలు
## గ్రామ సర్పంచ్ సిహెచ్. శివయ్య



**యాలాల మార్చి 4 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ సిహెచ్. శివయ్య అధ్యక్షతన హోలీ పండుగ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సిహెచ్ శివయ్య మాట్లాడుతూ చలికాలం పోయిన తర్వాత వసంత రుతువు రావడంతో పచ్చని చెట్లు చిగురిస్తూ, సిరిసంపదలతో పంటలు పండించాలని అన్నారు.హోలీ సంబరాలు అంటే పేద,ధనిక అని తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకోవడం కులమతాలకతీతంగా గ్రామంలోని ప్రజలందరూ మహిళలు యువకులు ఒకరికొకరు రంగులు చల్లుకోవడం జరిగింది.ఇదేవిధంగా తెలంగాణ సాంప్రదాయాలు, మరువకూడదని భవిష్యత్తులో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను అనుసరించి పెద్ద ఎత్తున పండుగలు జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శోభ రాజిరెడ్డి ,తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోనెగాడి శ్రీనివాస్,వార్డు మెంబర్లు గడ్డం బసవరాజ్,ఉప్పరగిరి శేఖర్,బోయిన ఉమేష్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు.బుగ్గప్ప,కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య,నాయకులు రాపోల్ నాగయ్య, బుర్నపురి నర్సిములు,మంగలి అశోక్,ఎరుకల సాయిలు, మంగలి ఆనంద్,వర్ల రాజు,న్యాదీర్గ హనుమంతు, పాల్గొన్నారు.

# మల్కాపూర్‌లో ఇఫ్తార్ విందు



**చేవెళ్ల, (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్‌లో సయ్యద్ సద్దాం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారిశైలజాఆగి రెడ్డి, మాజీ సర్పంచి శేరి శివారెడ్డి, మైనార్టీ నాయకులు సయ్యద్ ఫరూక్, సయ్యద్ విక్రముద్దీన్, జాఫర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దెల చింటు పాల్గొన్నారు. రంజాన్ మాసం సౌభ్రాతృత్వం, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

## ఓయూ ప్రొఫెసర్ కాశీం రాష్ట్ర

# ముఖ్యమంత్రి దగ్గర మాదిగ జాతి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెడుతుండు : ఎంఎస్ఎఫ్



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ఉద్యోగుల పేరు మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేయబోతున్న సన్మాన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి, పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు ఎలాంటి సంబంధం లేదని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ హాజరై మాట్లాడారు. మాదిగ జాతి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. ఓయూ ప్రొఫెసర్ కాశీం కాంగ్రెస్ ప్రభుత్వానికి మాదిగ జాతి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాలని చూస్తున్నాడని మండిపడ్డారు. మందకృష్ణ మాదిగకు, మాదిగ ఉద్యోగులకు చెప్పకుండా వర్గీకరణ పేరు పెట్టి కృతజ్ఞత సభతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్మానం చేయడానికి ప్రొఫెసర్ కాశీం ఎవరని ప్రశ్నించారు. ఏ పాలకుని దయాదాక్షిణ్యాలతో ఎస్సీ వర్గీకరణ జరగలేదన్నారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎంతో మంది మాదిగ జాతి బిడ్డలు లాఠీ దెబ్బలు, జైలు జీవితాలు, ప్రాణ త్యాగాలతో ఎస్సీ వర్గీకరణ సాధ్యపడిందన్నారు. ప్రొఫెసర్ కాశీం ఓయూలో ప్రొఫెసర్ గా ఉద్యోగం పొందాడంటే దానికి ప్రధాన కారణం మందకృష్ణ మాదిగ అని అనేక సందర్భాల్లో , అనేక వేదికల మీద స్వయంగా ప్రొఫెసర్ కాశీం చెప్పారని గుర్తు చేశారు. కాశీం మీద గత ప్రభుత్వాలు కేసులు పెట్టి జైలుకు పంపితే బయటకు తీసుకవచ్చి, తన ప్రాణాలకు, తన కుటుంబానికి అండగా నిలిచింది మందకృష్ణ మాదిగ అని చెప్పారు. అలాంటి మందకృష్ణ మాదిగకు, మాదిగ జాతికి వెన్నుపోటు పొడుస్తూ రేవంత్ రెడ్డి దగ్గర ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెడుతూ మాదిగ ద్రోహిగా ప్రొఫెసర్ కాశీం మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు రావలసిన రిజర్వేషన్ల వాటా ఇవ్వకుండా,గత నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేయకుండా, వేలాదిమంది నిరుద్యోగులకు జరిగిన అన్యాయం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్న మందకృష్ణ మాదిగ నిర్ణయాన్ని కాదని... తన స్వార్థ ప్రయోజనం కోసం వర్గీకరణ పేరుతో ముఖ్యమంత్రికి కృతజ్ఞత చెప్పడం మాదిగ జాతికి చేసే ద్రోహం అవుతుందే తప్ప మేధావి తనం కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పల్లెర్ల సుధాకర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేష్ మాదిగ, రాష్ట్ర నాయకులు ఎడవెల్లి అజయ్ మాదిగ, ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు దావు ఆదిత్య మాదిగ, పాల్గొన్నారు.

# బూతులు మానుకోని...బుద్దితో మసలుకోవాలి

- గ్రామ ప్రజలు తీరష్కరించినా బుద్ది రాలేదు
- మా నేతలపై తప్పుడు ఆరోపణలు సరికాదు
- ఆరోపణలు చేసే ముందు ఆలోచించి మాట్లాడాలి
- అంతారం మాజీ ఉప సర్పంచ్ ఎన్.జీవరత్నం బద్యానాయక్



**తాండూరు మార్చి 4 (జనంసాక్షి):** బూతులు మానుకోని బుద్దితో మసలుకోవాలని అంతారం మాజీ ఉప సర్పంచ్ ఎన్.జీవరత్నం బద్యానాయక్ లు పేర్కొన్నారు.బుధవారం తాండూరు పట్టణం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్.జీ వరత్నం భాద్యా నాయక్ లు కలిసి మాట్లాడుతూ మానేతలపై తప్పుడు ఆరోపణలు సరికాదని పేర్కొన్నారు. ఆరోపణలు చేసే ముందు ఆలోచించి మాట్లాడాలని హెచ్చరించారు. డాక్టర్ సంపత్ కుమార్ మరియు సీనియర్ నాయకులు పట్లోళ్ళ నరసింహులు పై కావాలని బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత 2018సంవత్సరం లో బషీర్ మియా తాండాకు చెందిన మిత్రునాయక్ డాక్టర్ సంపత్ కుమార్ మరియు నర్సింలు దగ్గర రూ.13లక్షలు తీసుకుని పట్టణంలో ని గంగోత్రి సమీపంలో ఉన్న తన ప్లాట్ ను రిజిస్ట్రేషన్ చేయిస్తానని తీసుకున్నారని తెలిపారు. డూప్లికేట్ పత్రాలు సృష్టించి వేరే వారికి రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని అడగితే రేపు మాపు అంటూ 8 సంవత్సాల నుండి కాలం వెల్లదీశారు.వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మిత్రునాయక్ బ్రోకర్ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. బషీర్ మియ్య తండాలో ఎలాంటి అబివృద్దే చేయ్యలేదని గ్రామంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని ,అయినా కూడా బుద్ది రాలేదన్నారు.ఇప్పటికైనా బుద్దితో మసలుకోవాలని సూచించారు. మానాయకుల జోలికొస్తే పరిణామాలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తాందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ ,ప్రకాష్ ,వెంకట్ ,డెవిడ్ ,మహేందర్ ,నర్సింలు తదితరులు ఉన్నారు.

# చివరికి ధర్మమే గెలిచింది : సర్పంచ్ వర్త్య శాంతమ్మ

- బాధ్యతలు అప్పగించాలంటూ అధికారులకు కోర్టు ఉత్తర్వులు
- బూటకపు ఆరోపణలతో సస్పెండ్ చేయించారు శాంతమ్మ



**శంకరపల్లి, మార్చి 04 (జనంసాక్షి):** ఆరోపణలతో అభివృద్ధిని ఎవరు అడ్డుకోలేరని మరోసారి రుజువైందంటూ మోకిలా తాండ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఓటమిని జీర్ణించుకోలేని కొంతమంది చేసిన పనులకు తెలంగాణ హైకోర్టు మొట్టికాయలు వేసింది.తిరిగి వర్త్య శాంతమ్మను పదవిలో కొనసాగాలని కోర్టు,జిల్లా కలెక్టర్కు ఉత్తర్వులు జారీ చేసింది.నిజ నిజాలు ప్రజలు గ్రహిస్తూనే ఉంటారని, బెదిరింపులు అసత్య ఆరోపణలతో ఏం చేయలేరని గ్రామస్తులు అన్నారు.రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండలం మోకిల తండా గ్రామపంచాయతీ సర్పంచ్గా వర్త్య శాంతమ్మను తిరిగి పదవిలో కొనసాగాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ప్రభుత్వాస్తులకు నష్టం కలిగించడం, పంచాయతీ స్థలంలో మొక్కలను ధ్వంసం చేయడం వంటి ఆరోపణలతో సస్పెండ్ కాబడిన శాంతమ్మ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు పెండింగ్ విచారణ కొనసాగుతున్నప్పటికీ ఆమెను సర్పంచిగా బాధ్యతలు స్వీకరించాలని వెంటనే ఉపసర్పంచ్ నుంచి శాంతమ్మ సర్పంచ్ బాధ్యతలను తీసుకోవాలని కోర్టు సూచించింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని జిల్లా, మండల, గ్రామ అధికారులకు కోర్టు సూచించింది.ఈ సందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ నిజం ఎప్పటికైనా గెలుస్తుందని ఎల్లప్పుడూ తనను గెలిపించిన ప్రజల కోసం సేవ చేసేందుకు ముంటానన్నారు.గ్రామ ప్రజల తీర్పుతో గెలిచామని, వారి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.